RNI NO: TELTEL2023/46567

# అక్షర వేదం

తెలుగు దినపత్రిక

ప్రతి అక్షరం ప్రజల పక్షం

AKSHARA VEDAM TELUGU DAILY

Published at Karimnagar circulated in : Telangana | సంచిక : 361 | సంపుటి : 02 | శుక్రవారం 21-11-2025 | పేజీలు -8 | వెల: రూ. 05.00

**విలేకరులు కావలెను**

తెలంగాణ ప్రాంతం అన్ని జిల్లాల నుండి స్టాప్ రిపోర్టర్లు, జిల్లా ఇన్చార్జులు, మండల రిపోర్టర్లు అర్జెంటుగా కావలెను అనుభవం ఉన్నా లేకున్నా తీసుకోబడును

చీఫ్ ఎడిటర్ -పందిళ్ల రవీందర్ (9030653934)

ఎడిటర్ -పొన్నం ప్రసాద్ గౌడ్

9666992524

## బీహార్ సీఎంగా నితీశ్ ప్రమాణం

- 27మంది మంత్రులు కూడా ప్రమాణం
- ప్రమాణం చేయించిన గవర్నర్
- హాజరైన మోడీ, అమిత్ షా, చంద్రబాబు



పాట్నా,

బిహార్ సీఎంగా జేడీయూ అధినేత నితీశ్ కుమార్ గురువారం ప్రమాణస్వీకారం చేశారు. సిఎంగా ఆయన ప్రమాణస్వీకారం చేయడం ఇది పదోసారి. పట్నాలోని గాంధీ మైదానంలో నితీశ్‌తో పాటు 27 మంది మంత్రులు ప్రమాణస్వీకారం చేయగా.. సామ్రాట్ చౌదరీ, విజయ్ కుమార్ సిన్హాలకు డిప్యూటీ సీఎం పదవులు దక్కాయి. గవర్నర్ అరీఫ్ మహ్మద్ ఖాన్ సిఎం, మంత్రులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తదితరులు హాజరయ్యారు.

-మిగతా 2 లో

## గవర్నర్లు, రాష్ట్రపతికి గడవు విధించలేం

- గవర్నర్లకు మూడు అంశాల్లోనే నిర్ణయం
- సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక తీర్పు



న్యూఢిల్లీ

గవర్నర్,రాష్ట్రపతి అధికారాలపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. పెండింగ్ బిల్లుల ఆమోదానికి సంబంధించిన అంశంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించటం తగదని స్పష్టం చేసింది. కారణం చెప్పకుండా గవర్నర్‌లు బిల్లులను వెనక్కి పంపలేరని తెలిపింది. బిల్లును నిరవధికంగా నిలిపివేసే అధికారం గవర్నర్‌కు లేదని కూడా తేల్చి చెప్పింది. గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి పంపితేనే రాష్ట్రపతి చర్యలు తీసుకోగలరని చెప్పింది. ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కు విచక్షణాధికారం ఉందని వెల్లడించింది. తన ముందుకు వచ్చిన బిల్లులను గవర్నర్ రాష్ట్రపతికి పంపడం, అభిప్రాయాలతో తిరిగి పంపడం, బిల్లును పరిశీలించి సూచనలు ఇవ్వడం వంటివి మాత్రమే చేస్తారని

-మిగతా 2 లో



## ఫిరాయింపు ఎమ్మెల్యేపై విచారణ

- పోచారం, అరికెపూడిలతో ముగింపు
- దానం, కడియంలకు మరోమారు నోటీసులు

హైదరాబాద్,-నవంబర్ 20 అక్షర వేదం

సుప్రీం మరో నాలుగు వారాల గడువు ఇవ్వడంతో పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు ఎదుర్కుంటున్న 10 మంది ఎమ్మెల్యేలకు తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ నోటీసులు జారీ చేశారు. గురువారం పోచారం శ్రీనివాసరెడ్డి, అరికెపూడి గాంధీలను విచారించారు. పదిమందిలో ఇద్దరు ఎమ్మెల్యేలు మాత్రం ఇప్పటి వరకు అఫిడవిట్‌లు దాఖలు చేయని పరిస్థితి. ఎమ్మెల్యేలు దానం నాగేందర్, కడియం శ్రీహరి.. స్పీకర్ నోటీసులకు స్పందించని విషయం తెలిసిందే. దీంతో వారిరువురికి స్పీకర్ మరోసారి నోటీసులు జారీ చేశారు. అనర్హత పిటిషన్లపై అఫిడవిట్ దాఖలు చేయాలని అసెంబ్లీ స్పీకర్ స్పష్టం చేశారు. ఇక.. పార్టీ ఫిరాయింపుల ఆరోపణలు

-మిగతా 2 లో

## సన్న బియ్యం పంపిణీ పథకం

# విజయవంతం

### దేశమంతా సన్నబియ్యం ఇవ్వండి

- కేంద్రమంత్రికి సీఎం రేవంత్‌రెడ్డి సలహా
- రాష్ట్రంలో ఈ పథకం సక్సెస్ అయ్యిందని వెల్లడి
- దీనివల్ల బియ్యం మార్కెట్ ధరలు స్థిరపడ్డాయని వివరణ
- సీఎం విజ్ఞప్తులపై సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషి





హైదరాబాద్ -నవంబర్ 20 అక్షర వేదం

తెలంగాణలో అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ పథకం విజయవంతమైందనీ, దీన్ని దేశమంతా విస్తరింపచేయాలని ముఖ్యమంత్రి ఏ రేవంత్‌రెడ్డి కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషికి సూచించారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రేషన్ షాపుల ద్వారా పేదలకు సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామనీ, దీనివల్ల పీడీఎస్ బియ్యం రీ సైక్లింగ్ తగ్గి, బహిరంగ మార్కెట్లో ధరలు స్థిరపడ్డాయని వివరించారు. ప్రజలు తినే బియ్యాన్ని పంపిణీ చేయటంతో ఈ పథకం ఆశించిన లక్ష్యం నెరవేరిందని చెప్పారు. దీనిపై కేంద్రంమంత్రి ప్రహ్లాద్‌జోషీ స్పందిస్తూ కేంద్ర ప్రభుత్వం సన్న బియ్యం పంపిణీపై పూర్తిస్థాయి అధ్యయనం చేసి దేశవ్యాప్తంగా ఈ

-మిగతా 2 లో



## నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి రాక

- రేపు తిరిగి పుట్టపర్తికి ముర్ము ప్రయాణం

హైదరాబాద్,-నవంబర్ 20 అక్షర వేదం

తిరుమల పర్యటన ముగించుకుని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం మధ్యాహ్నం 1.10 గంటలకు ప్రత్యేక విమానంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి నేరుగా ఆమె రాజ్ భవన్‌కు వెళ్తారు. మధ్యాహ్నం భోజనం చేసి.. రాజ్ భవన్‌లో విశ్రాంతి తీసుకుంటారు. ఆ తర్వాత 3:50 గంటలకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయానికి ఆమె చేరుకుంటారు. సాయంత్రం 4.00 గంటలకు రాష్ట్రపతి నిలయం వేదికగా నిర్వహించే భారతీయ కళా మహోత్సవాన్ని రాష్ట్రపతి ముర్ము ప్రారంభిస్తారు. తిరిగి సాయంత్రం 6:15 గంటలకు ఆమె తిరిగి రాజ్ భవన్‌కు

-మిగతా 2 లో



## ట్రంప్ సర్కార్ పచ్చజెండా

- భారత్‌కు రూ.824 కోట్ల విలువైన అమెరికా ఆయుధాలు
- జావెలిన్ క్షిపణులు సహా పలు ఆయుధాల విక్రయానికి ఆమోదం

న్యూయార్క్

భారత్‌కు రక్షణ ఎగుమతులపై అమెరికా కీలక నిర్ణయం తీసుకుంది. ఎఫ్‌జీఎం -148 జావెలిన్ యాంటీ-ట్యాంక్ గైడెడ్ మిస్సైల్ సిస్టమ్‌తో పాటు ఎం982ఏ1 ఎక్స్‌క్యాలిబర్ ప్రెసిషన్ గైడెడ్ ఆర్టిలరీ ప్రొజెక్టైల్స్, వాటి అనుబంధ సామగ్రిని భారత్‌కు అగ్రరాజ్యం విక్రయించనుంది. దాదాపు రూ.824 కోట్ల (93 మిలియన్ డాలర్లు) విలువైన ఈ భారీ డీల్‌కు డోనాల్డ్ ట్రంప్ సర్కార్ పచ్చజెండా ఊపింది. దీనిపై అమెరికాకు చెందిన డిఫెన్స్ సెక్యూరిటీ కోఆపరేషన్ ఏజెన్సీ (డీఎస్‌సీఏ) ఓ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. భారత్‌కు అందించనున్న ఆయుధ సామగ్రి జాబితాలో 100 జావెలిన్ మిస్సైళ్లు, 1 ఫ్లైటు బై రౌండ్, 25 కమాండ్ లాంచ్ యూనిట్లు, ట్రైనింగ్ ఎయిడ్‌లు, సిమ్యులేషన్ రౌండ్లు, ఆయుధ సామగ్రితో ముడిపడిన విడి భాగాలు ఉన్నాయని డీఎస్‌సీఏ తెలిపింది.


-మిగతా 2 లో

## 25న పంచాయతీ

# షెడ్యూల్?

### మూడు దశల్లో పోలింగ్ ప్రక్రియ

- డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో ఎన్నికల నిర్వహణకు చర్యలు :
- సీఎస్, డీజీపీతో కలిసి వీడియో కాన్ఫరెన్స్
- రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ నివేదిక సమర్పణ
- జిల్లా కలెక్టర్లు, ఎస్పీలకు ఎస్ఈసీ ఆదేశం



హైదరాబాద్ -నవంబర్ 20 అక్షర వేదం

రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన షెడ్యూల్‌ను 25న ప్రకటించే అవకాశముంది. మూడు దశల్లో నిర్వహించే ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్లు, ఎస్పీలను తెలంగాణ రాష్ట్ర ఎన్నికల కమిషన్ (ఎస్ఈసీ) ఆదేశించింది. గురువారం పంచాయతీ ఎన్నికల నిర్వహణపై హైదరాబాద్‌లోని ఎన్నికల కమిషన్ ప్రధాన కార్యాలయం నుంచి సీఎస్ రామకృష్ణరావు, డీజీపీ శివధర్‌రెడ్డితో కలిసి కమిషనర్ రాణి కుముదిని వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఎన్నికల నిర్వహణ, ఏర్పాట్లపై కమిషనర్ అధికారులకు పలు సూచనలు చేశారు.

-మిగతా 2 లో




## బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండిద్దాం

- పౌర సమాజం స్పందించకపోతే భవిష్యత్ మరింత ప్రమాదకరం
- పేదల కోసం పనిచేసే మావోయిస్టులతో చర్చలెందుకు జరపరు?
- రౌండ్‌టేబుల్ సమావేశంలో వామపక్ష, కాంగ్రెస్ పార్టీల నేతలు
- నేడు అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా
- కేంద్రం తీరును తప్పుబడుతూ సంతకాల సేకరణ

హైదరాబాద్

బూటకపు ఎన్‌కౌంటర్లతో మావోయిస్టులను హత్యచేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం ఉదయం హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద వామపక్ష పార్టీలు, కాంగ్రెస్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్టు గురువారం హైదరాబాద్‌లోని మఖ్దూం భవన్‌లో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అధ్యక్షతన జరిగిన రౌండ్ టేబుల్ సమావేశం ప్రకటించింది. బూటకపు ఎన్‌కౌంటర్లను తప్పుబడుతూ ప్రజల నుంచి సంతకాల సేకరణ చేయాలని నిర్ణయించింది. పాక్ ఉగ్రదాడులపై సైతం చర్చలు జరుపుతున్న కేంద్ర ప్రభుత్వం..ప్రజల కోసం పనిచేస్తున్న దేశపౌరులైన మావోయిస్టులతో ఎందుకు చర్చలు జరపట్లేదని ప్రశ్నించింది. బూటకపు ఎన్‌కౌంటర్లపై పౌర సమాజం స్పందించకపోతే భవిష్యత్ మరింత ప్రమాదకరంగా మారుతుందని హెచ్చరించింది. అటవీ ప్రాంతాల్లో విలువైన ఖనిజ సంపదను మార్చి 2026 నాటికి కార్పొరేట్లకు అప్పగించేందుకు మోడీ సర్కారు మాట ఇచ్చిందనీ, అందుకే అడ్డుగా ఉన్న మావోయిస్టులను ఎన్‌కౌంటర్ల పేరుతో చంపేయిస్తున్నదని విమర్శించింది. లొంగిపోయేందుకు ప్రయత్నించిన వారిని, కాళ్లులు విరమించి

-మిగతా 2 లో




## కేటీఆర్‌కు బిగ్ షాక్

- ఫార్ములా -కారు రేసు కేసు విచారణకు గవర్నర్ అనుమతి
- ఈ-కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణ
- ఏసీబీ అధికారులకు అనుమతి ఇస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ

హైదరాబాద్, -నవంబర్ 20 అక్షర వేదం

మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు బిగ్ షాక్ తగిలింది. ఈ ఫార్ములా -కారు రేసు కేసుకు సంబంధించి ఆయనపై విచారణ చేపట్టేందుకు గవర్నర్ అధికారికంగా అనుమతి మంజూరు చేశారు. ఈ కేసులోనిధుల దుర్వినియోగంపై విచారణ కొనసాగించేందుకు గవర్నర్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. గవర్నర్ అనుమతితో ఏసీబీ త్వరలోనే కేటీఆర్‌పై చార్జ్‌షీట్ దాఖలు

-మిగతా 2 లో




## సీబీఐ కోర్టుకు హాజరైన జగన్

- వ్యక్తిగత హాజరు తో పూర్తయిన లాంఛనం
- జగన్ రాకతో అభిమానుల హల్‌చల్

2 లో

# గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు విధించలేం

మొదటి తరువాయి

తెలిపింది. రాష్ట్ర పరిపాలనలో తుది అధికారం ఎన్నుకోబడిన మంత్రివర్గానిదేనని స్పష్టం చేసింది. ఒక రాష్ట్రంలో రెండు ఎగ్జిక్యూటివ్ పవర్స్ ఉండవని, ప్రభుత్వం ఒక్కటే ప్రధాన నిర్ణయాధికారి అని తేల్చి చెప్పింది. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులకు ఆమోదం తెలిపే విషయంలో న్యాయస్థానం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించటంపై ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము పంపిన ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌పై స్పందిస్తూ సుప్రీంకోర్టు ఈ తీర్పును వెలువరించింది. రాష్టర శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే అంశంలో సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానం గడువు విధించడంపై దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్ము సంధించిన ప్రశ్నలపై అత్యున్నత న్యాయస్థానం సమాధానమిచ్చింది. పెండింగ్ బిల్లుల ఆమోదం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించడం తగదని సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టంచేసింది. అయితే, కారణం చెప్పకుండా గవర్నర్లు బిల్లులను వెనక్కి పంపలేరని వెల్లడించింది. ఈ మేరకు దీనిపై గతంలో ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సీజేఐ ధర్మాసనం పక్కనబెట్టింది. గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు ఆప్షన్లు ఉంటాయి. బిల్లులకు సమ్మతి తెలియజేయడం, కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం, బిల్లును తిరస్కరించి అసెంబ్లీకి పంపడం. ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారు. ఇందుకు న్యాయస్థానాలు గడువు విధించడం సబబు కాదని అభిప్రాయపడ్డారు. గవర్నర్ల విధుల నిర్వహణ వ్యవహారాల్లో కోర్టులు జోక్యం చేసుకోవు. కానీ, కారణం లేకుండా దీర్ఘకాలంగా బిల్లులను పెండింగ్‌లో ఉంచిన సందర్భాల్లో కోర్టులు పరిమిత విచక్షణతో వ్యవహరించొచ్చు. రాష్ట్రపతి విషయంలోనూ ఇదే వర్తిస్తుంది. నిరవధిక ఆలస్యం కొనసాగుతున్న సందర్భాల్లో అది న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని తెలిపారు. గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి రిజర్వ్ చేసిన ప్రతిసారీ ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి సుప్రీంను సంప్రదించాల్సిన అవసరం లేదు. ఆర్టికల్ 200 కింద గవర్నర్లకు విచక్షణాధికారం ఉంటుంది. అయితే, దాన్ని అపరిమితంగా వినియోగించలేరు. శాసనసభలు ఒకటికి రెండుసార్లు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆ బిల్లులను ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం నిర్దేశిరచింది. దీంతో రాజ్యాంగ అధికరణం 143(1) ప్రకారం తనకున్న అధికారాన్ని వినియోగిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము మే నెలలో పలు ప్రశ్నలతో సీజేఐకి లేఖ రాశారు. రాష్ట్రపతి విచక్షణ అధికారాల పరిధిలోకి వచ్చే రాష్ట్రాల బిల్లులకు ఆమోదం తెలిపే అంశంలో న్యాయస్థానం గడువు విధించడం ఎంతవరకు న్యాయ సమ్మతమో తెలపాలంటూ సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. దీనిపై సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. పది రోజుల పాటు అన్ని పక్షాల వాదనలను ఆలకించిన ధర్మాసనం సెప్టెంబరు 11న తీర్పు రిజర్వు చేసింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించలేమంటూ తాజాగా తీర్పు వెలువరించింది.

## ట్రంప్ సర్కార్ పచ్చజెండా

మొదటి తరువాయి

రూ.417 కోట్ల విలువైన 216 యూనిట్ల 'ఎం982ఏ1 ప్రొజెక్టైల్స్'ను, రూ.405 కోట్ల విలువైన 126 యూనిట్ల జావెలిన్ మిస్సైల్ సిస్టమ్‌లను భారత్‌కు విక్రయిస్తున్నట్టు పేర్కొంది. ఈ మొత్తం సామగ్రికి అమెరికా సైన్యం వైపు నుంచి పూర్తిస్థాయి జీవితకాల మద్దతు లభిస్తుందని వెల్లడించింది. ఈ ప్రతిపాదిత లావాదేవీకి అవసరమైన సర్టిఫికేషన్‌ను అమెరికా కాంగ్రెస్‌కు డీఎస్‌సీఏ అందజేసింది. ఇండో-పసిఫిక్, దక్షిణాసియాల్లో సుస్థిరతే లక్ష్యం "అమెరికా-భారత్‌ల వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు, ప్రధాన రక్షణరంగ భాగస్వామి అయిన భారత్ భద్రతను మెరుగుపర్చేందుకు ఈ ఆయుధ సామగ్రిని విక్రయిస్తున్నాం. ఈ విక్రయ డీల్ అమెరికా విదేశాంగ విధానం, జాతీయ భద్రతా లక్ష్యాలకు మద్దతును అందిస్తుంది. దీనివల్ల ఇండో-పసిఫిక్, దక్షిణ ఆసియా ప్రాంతాల్లో రాజకీయ సుస్థిరత, శాంతి, ఆర్థిక వికాసానికి ఊతం లభిస్తుంది. ఆ ప్రాంతాల్లో సైనికపరమైన సమతుల్యత కూడా ఏర్పడుతుంది. ఈ ఆయుధ సామగ్రి ప్రస్తుత, భవిష్యత్ ముప్పులను అత్యంత కచ్చితత్వంతో ఎదుర్కొనేలా భారత్‌కు ఉపయోగపడుతుంది. కచ్చితత్వంతో దాడులు చేయగల సామర్థ్యం భారత్‌కు లభిస్తుంది. ఈ సామగ్రిని భారత సైన్యం సమర్థవంతంగా వినియోగించగలదు" అని డీఎస్‌సీఏ ఓ ప్రకటనలో వెల్లడించింది. అయితే అమెరికా మెప్పుకోసమే మోడీ భారీగా రక్షణ ఆయుధాలను కొంటున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

## 25న పంచాయతీ షెడ్యూల్?

మొదటి తరువాయి

గ్రామ పంచాయతీ ఓటర్ల జాబితా, పోలింగ్ స్టేషన్ల ప్రచురణ, ఎన్నికల నిర్వహణకు రవాణా ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది కేటాయింపు, పరిశీలకుల మోహరింపు తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా స్వేచ్ఛగా, నిస్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని ఆదేశించారు. సమీక్షలో ఎన్నికల పరిశీలకులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

**రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ నివేదిక**

పంచాయతీ ఎన్నికల రిజర్వేషన్లపై డెడికేటెడ్ కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. పంచాయతీలు, వార్డుల వారీగా ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు 50 శాతం మించకుండా సిఫారసు చేసింది. డెడికేటెడ్ కమిషన్ ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయనుంది. ఈనెల 24న హైకోర్టు విచారణకు ముందే రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రక్రియను పూర్తి చేయనుంది. ఈనెల 24 లేదా 25న షెడ్యూల్ ప్రకటించేందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం సిద్ధమైంది. 12,733 పంచాయతీ, 1,12,288 వార్డుల్లో మూడు విడతల్లో డిసెంబర్ 11, 14, 17 తేదీల్లో ఎన్నికలు పూర్తి చేసేలా కసరత్తు చేస్తోంది. మొత్తం పోలింగ్ ప్రక్రియను డిసెంబరు 16 వరకు పూర్తి చేయనున్నట్టు సమాచారం.

# సీబీఐ కోర్టుకు హాజరైన జగన్

**వ్యక్తిగత హాజరు తో పూర్తయిన లాంఛనం**
**జగన్ రాకతో అభిమానుల హల్‌చల్**

హైదరాబాద్,
అక్రమాస్తుల కేసులో వైకాపా అధ్యక్షుడు, మాజీ సీఎం జగన్ సీబీఐ ప్రత్యేక కోర్టుకు హాజరయ్యారు. న్యాయమూర్తి ఎదుట విచారణకు వచ్చారు. విజయవాడ నుంచి బేగంపేట ఎయిర్‌పోర్టుకు వచ్చి అక్కడి నుంచి నాంపల్లిలోని కోర్టుకు ఆయన చేరుకున్నారు. విచారణ అనంతరం జగన్ అక్కడి నుంచి లోటస్‌పాండ్‌కు వెళ్లిపోయారు. మరోవైపు వైకాపా నేత పేర్ని నాని, మరో ముగ్గురు నేతలను కోర్టు లోపలికి పోలీసులు అనుమతించలేదు. దీంతో వారు గేట్ వద్దే నిలుచున్నారు. ఈ కేసులో




2013 సెప్టెంబర్ నుంచి జగన్ బెయిల్‌పై ఉన్నారు. ఇప్పుడు కూడా వ్యక్తిగత హాజరు నుంచి తనకు మినహాయింపు ఇవ్వాలని ఆయన కోరగా సీబీఐ తీవ్రంగా వ్యతిరేకించింది. ఆరేళ్లుగా జగన్ కోర్టుకు ప్రత్యక్షంగా హాజరవడం లేదని, ఈ కేసుల్లో డిశ్చార్జి పిటిషన్లపై రోజువారీ విచారణ జరుగుతున్నందున ప్రత్యక్షంగా హాజరవ్వాలని సీబీఐ తెలిపింది. దీంతో ఈ నెల 21లోగా వ్యక్తిగతంగా హాజరవ్వాలని కోర్టు ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఒకరోజు ముందే ఆయన కోర్టుకు హాజరయ్యారు. అక్రమాస్తుల కేసులో వైకాపా అధ్యక్షుడు జగన్ సీబీఐ కోర్టుకు హాజరుకానున్న నేపథ్యంలో బేగంపేట ఎయిర్‌పోర్ట్ వద్ద వైకాపా కార్యకర్తలు హల్‌చల్ చేశారు. కొందరు రప్పా రప్పా అంటూ నినాదాలు చేశారు. ఎయిర్ పోర్టు లోపలికి చొచ్చుకెళ్లే ప్రయత్నం చేయగా పోలీసులు అడ్డుకున్నారు. దీంతో వారితో వాగ్వాదానికి దిగారు. మరోవైపు సీబీఐ కోర్టు వద్ద పెద్ద ఎత్తున పోలీసులు మోహరించారు.

# కేటీఆర్‌కు బిగ్ షాక్

మొదటి తరువాయి

చేయనుందని సమాచారం. ప్రభుత్వం ఈ విషయంలో లేఖ రాయడంతో ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏసీబీ విచారించేందుకు గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ అనుమతించారు. ఈ కేసులో ఇప్పటికే పలుమార్లు కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో రూ.54.88 కోట్ల నిధుల దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈక్రమంలో కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు గవర్నర్ అనుమతి కోరుతూ గతంలో ఏసీబీ లేఖ రాసింది. ఆయన పాత్రపై సాక్ష్యాలు ఉన్నాయంటూ అందులో పేర్కొంది. ఈక్రమంలో తాజాగా ఏసీబీ అధికారులకు అనుమతి ఇస్తూ గవర్నర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఫార్ములా ఈ-కార్ రేసింగ్ కేసులో త్వరలోనే ఏసీబీ ఛార్జ్‌షీట్ దాఖలు చేయనుంది. ఈ కేసులో కేటీఆర్‌ను ఏ-1 గా, సీనియర్ ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ ను ఏ-2గా ఏసీబీ పేర్కొంది. ఇప్పటికే కేటీఆర్ ఈ కేసు విషయంలో ఏసీబీ విచారణకు నాలుగు సార్లు హాజరయ్యారు. ఈ కేసులో ఏ-2గా ఉన్న ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్ విషయంలో తదుపరి చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులు ఇప్పటికే కేంద్రంలోని డీఓపీటీకు లేఖ రాశారు.



గవర్నర్ అనుమతి నేపథ్యంలో, చార్జ్‌షీట్ దాఖలుకు ముందు ఏసీబీ అధికారులు మరోసారి కేటీఆర్‌ను లేదా ఇతర కీలక వ్యక్తులను విచారించే అవకాశం ఉంది. ఈ కేసుపై గవర్నర్ అనుమతి లభించడంతో, రాజకీయ వర్గాలలో, పరిపాలనా వర్గాలలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఏసీబీ త్వరలో దాఖలు చేయబోయే చార్జ్‌షీట్‌తో ఈ కేసు విచారణ కీలక మలుపు తిరగనుంది. ఫార్ములా ఈ-కారు రేసులో క్విడ్ ప్రోకో జరిగినట్టు ఏసీబీ నివేదిక ఇచ్చిన విషయం తెలిసిందే. రూ.54.88 కోట్ల నిధులు దారి మళ్లింపుపై ఆరోపణలు చేసింది. ఇక, 2024లో ఫార్ములా ఈ-కారు కేసులో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. కార్ రేస్ వ్యవహారంలో 2024 డిసెంబర్ నెలలో ఏసీబీ కేసు నమోదు చేసిన సంగతి తెలిసిందే. మాజీ మంత్రి కేటీఆర్‌ను ఏ1గా ఎఫ్ఐఆర్‌లో పేర్కొన్నారు. కేసు విచారణలో భాగంగా ఇప్పటికే కేటీఆర్‌ను రెండు సార్లు, ఐఏఎస్ అధికారి అరవింద్ కుమార్‌ను 3 సార్లు ఏసీబీ అధికారులు విచారించారు. తాజాగా ప్రభుత్వానికి నివేదికను సమర్పించారు. కేసుకు సంబంధించిన నివేదికను అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ) అధికారులు మంగళవారం తెలంగాణ ప్రభుత్వానికి అందించారు. ప్రాసిక్యూషన్ అనుమతి కోరుతూ ఏసీబీ అధికారులు ఈ నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో కేటీఆర్ మున్సిపల్ శాఖ మంత్రిగా పనిచేశారు. ఈ నేపథ్యంలో కేటీఆర్‌ను ఈ కేసులో ఏ1గా పేర్కొంటూ ఏసీబీ కేసు నమోదు చేసింది. ఫార్ములా- ఈ కార్ రేసు నిర్వహణ కోసం యూకేకు చెందిన ఫార్ములా-ఈ ఆపరేషన్స్, ఏస్ నెక్ట్స్‌జెన్ ప్రైవేట్ లిమిటెడ్, తెలంగాణ పురపాలకశాఖ 2022 అక్టోబరు 25న ఒప్పందం చేసుకున్నాయి. ఈ ఒప్పందం ప్రకారం కార్ రేస్ నిర్వహణకు అయ్యే ఖర్చును స్పాన్సర్‌గా ఉన్న ఏస్ నెక్ట్స్ జెన్ ప్రైవేట్ లిమిటెడ్ భరించాలి. అలాగే కార్ రేసు నిర్వహణకు వీలుగా తెలంగాణ పురపాలక శాఖ ట్రాక్‌ను ఏర్పాటు చేయాలి. అందులో భాగంగా 2023 ఫిబ్రవరి 11 జరిగిన రేస్ కోసం తెలంగాణ పురపాలక శాఖ తరుపున హెచ్ఎండీఏ రూ.12 కోట్లు ఖర్చు చేసింది.

## బీహార్ సీఎంగా నితీశ్ ప్రమాణం

మొదటి తరువాయి

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి అదరగొట్టింది. మొత్తం 243 అసెంబ్లీ సీట్లకు నితీశ్ కుమార్ నేతృత్వంలో ఎన్డీయే ఏకంగా 202 సీట్లు దక్కించుకుంది. బీజేపీ 101 సీట్లలో పోటీ చేసి 89 చోట్ల గెలుపొందింది. 101 సీట్లలోనే పోటీ చేసిన జేడీయూ 85 చోట్ల విజయం సాధించింది. తాజాగా ప్రమాణస్వీకారం చేసిన 27 మంత్రుల్లో.. 14 మంది బీజేపీ నుంచి కాగా, 9 మంది జేడేయూకు చెందిన నేతలు. బిహార్‌లో సీఎం నితీశ్ కుమార్ దాదాపు 19 ఏళ్లు పదవిలో ఉన్నారు. 2000 సంవత్సరంలో ఏడు రోజులు మాత్రమే సీఎంగా పని చేశారు. ఇప్పుడు ఎన్డీయే కూటమి మళ్లీ ఆయనకే పగ్గాలు అప్పగించడంతో పదోసారి సీఎంగా ప్రమాణం చేశారు. పదోసారి బిహార్ సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్‌కు ప్రధాని నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. 'సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన నితీశ్ కుమార్‌కు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. నితీశ్ రాజకీయంలో ఎంతో అనుభవం ఉన్న నాయకుడు. రాష్ట్రంలో మంచి పాలన అందించిన వ్యక్తి అనే అద్భుతమైన రికార్డు ఆయనకు ఉందని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు.

## నేడు హైదరాబాద్‌కు రాష్ట్రపతి రాక

మొదటి తరువాయి

చేరుకుంటారు. రాత్రి తెలంగాణ రాజ్‌భవన్‌లో రాష్ట్రపతి ముర్ము బస చేయనున్నారు. 22వ తేదీ అంటే..శనివారం ఉదయం 9:30 గంటలకు బేగంపేట ఎయిర్ పోర్ట్ నుంచి ప్రత్యేక విమానంలో ఆంధ్రప్రదేశ్ శ్రీసత్యసాయి జిల్లాలోని పుట్టపర్తికి బయలుదేరి వెళ్తారు. శ్రీ సత్యసాయి బాబా శత జయంత్యోత్సవాల్లో రాష్ట్రపతి ముర్ము పాల్గొనున్నారు. రాష్ట్రపతి పర్యటన నేపథ్యంలో హైదరాబాద్‌లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు.

## సన్న బియ్యం పంపిణీ పథకం విజయవంతం

మొదటి తరువాయి

పథకాన్ని అమల్లోకి తెచ్చేలా నిర్ణయం తీసుకుటుందని హామీ ఇచ్చారు. గురువారం హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్‌జోషితో సీఎం రేవంత్‌రెడ్డి భేటీ అయ్యారు. ఆయనతో పాటు మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కే రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, పౌరసరఫరాల శాఖ ముఖ్య కార్యదర్శి స్టీఫెన్ రవీంద్ర తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా రాష్ట్రానికి తగిన సహాయ సహకారాలు అందించాలంటూ సీఎం పలు అంశాలను కేంద్రమంత్రి వద్ద ప్రస్తావించారు. 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కోటా పెంచాలని కోరారు. పీడీఎస్ కింద సరఫరా చేసిన లెవీ రైస్‌కు సంబంధించిన రూ.1,468 కోట్ల సబ్సిడీ విడుదల చేయాలన్నారు. ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్నయోజన (పీఎంజీకేఏవై) అయిదో దశకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ.343.27 కోట్ల సబ్సిడీని కూడా విడుదల చేయాలని కోరారు. 2024-25 ఖరీఫ్ కస్టమ్ మిల్లింగ్ రైస్ వ్యవధి పొడిగించాలనీ, ఎఫ్‌సీఐ గోదాముల్లో నిల్వ ఇబ్బందులను అధిగమించేందుకు అదనపు బాయిల్డ్ రైస్ ర్యాక్‌లు కేటాయించాలని, రాష్ట్రంలో 15 లక్షల మెట్రిక్ టన్నుల గోదాముల నిల్వ సామర్థ్యం పెంచుకునేందుకు కేంద్ర ప్రభుత్వం సహాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. 2025-26 ఖరీఫ్‌లో అత్యధికంగా 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని, ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని 80 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలని కోరారు. ఈ డిమాండ్లన్నింటిపై కేంద్రమంత్రి ప్రహ్లాద్‌జోషీ సానుకూలంగా స్పందించారు. త్వరలో వీటిని పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్ అవసరం తగ్గిందనీ, అందువల్ల మిల్లింగ్‌కు అనువైన ముడి బియ్యం రకాల సాగును ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో మిగులు ధాన్యం నిల్వలను సమర్థంగా నిర్వహించేందుకు ఎగుమతి అవకాశాలను పరిశీలించుకోవాలని సూచించారు.

## ఫిరాయింపు ఎమ్మెల్యేపై విచారణ

మొదటి తరువాయి

ఎదుర్కుంటున్న ఎమ్మెల్యేల విచారణ గురువారంతో ముగిసింది. కేసు విచారణ ఆలస్యంపై సుప్రీం సీరియస్ అవడంతో పాటు నాలుగు వారాలు గడువు ఇచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విచారణలో వేగం పెంచాలని అసెంబ్లీ స్పీకర్ నిర్ణయించారు. ఇందులో భాగంగా రెండో విడత విచారణలో భాగంగా నలుగురు ఎమ్మెల్యేలను విచారణకు పిలిచారు. ఉదయం ఎమ్మెల్యేల విచారణ మొదలైంది. పోచారం శ్రీనివాస్ రెడ్డి వర్సెస్ జగదీశ్ రెడ్డి కేసును స్పీకర్ విచారించారు. ఇరు వర్గాల వాదనలను స్పీకర్ విన్నారు. అలాగే మధ్యాహ్నం అరికెపూడి గాంధీ వర్సెస్ ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్ కేసు విచారించారు. వీరి విచారణతో మొత్తం ఎనిమిది మంది ఎమ్మెల్యేల విచారణ పూర్తి అవుతుంది. మరోవైపు ఎమ్మెల్యే దానం నాగేందర్ ఢిల్లీ వెళ్లారు. ఏఐసీసీ పెద్దలను కలవనున్నారు. ఫిరాయింపు ఎమ్మెల్యేల విచారణ ముగియనున్నప్పటికీ ఇప్పటి వరకు దానం అఫిడవిట్లు దాఖలు చేయలేదు. విచారణకు హాజరైతే వేటు పడుతుందని దానం భావిస్తున్నట్లు తెలుస్తోంది. వేటు పడితే ఆరు సంవత్సరాల పాటు పోటీ చేయడానికి నో ఛాన్స్. ఈ క్రమంలో రాజీనామా చేసేందుకు దానం మొగ్గు చూపుతున్నట్లు సమాచారం. రాజీనామా చేస్తే తన పరిస్థితి ఏంటని పార్టీ పెద్దలతో దానం సంప్రదింపులు జరుపనున్నట్లు తెలుస్తోంది.

## బూటకపు ఎన్‌కౌంటర్లను ఖండిద్దాం

మొదటి తరువాయి

షెల్టర్ తీసుకుంటున్న మావోయిస్టులను చుట్టుముట్టి కాల్చి చంపడాన్ని తప్పుబట్టింది. దేశసంపదను కార్పొరేట్లకు దోచిపెట్టడం దేశభక్తి ఎలా అవుతుందని ప్రశ్నించింది.

**దేశంలో కమ్యూనిస్టులు బలపడాలి : టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్**

దేశంలో కేంద్రంలోని మోడీ సర్కారు విధానాలతో ప్రమాదకర పరిస్థితులు నెలకొన్న తరుణంలో కమ్యూనిస్టులు మరింత బలపడాల్సిన అవసరం ఉందని టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్ గౌడ్ అభిప్రాయపడ్డారు. వామపక్షభావజాలం ఉన్న వారిని బలహీనపర్చే ఎలిమినేషన్ ప్రక్రియను బీజేపీ సర్కారు ప్రారంభించిందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇలాంటి తరుణంలో కమ్యూనిస్టు పార్టీలు, కాంగ్రెస్, సోషలిస్టు భావజాలం కలిగిన ఇతర పార్టీలు ఏకమై బీజేపీపై పోరాడాల్సిన ఆవశ్యకత నేడు నెలకొందని చెప్పారు. ఫాసిస్టు శక్తులు బలపడితే దేశానికి, సమాజానికి ప్రమాదకరమని హెచ్చరించారు.

# పారిశ్రామిక అశాంతి కి యాజమాన్యమే బాధ్యత వహించాలి: సిఐటియు




**అక్షరవేదం/ గోదావరిఖని: నవంబర్20**
గోదావరిఖనిలోని ప్రెస్ క్లబ్ లో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు తుమ్మల రాజారెడ్డి మాట్లాడుతూ... గుర్తింపు సంఘం అలసత్వంతో యాజమాన్యం చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు పాల్పడటం వలన సంస్థలో పారిశ్రామిక అశాంతి నెలకోన్నదని ఆరోపించారు. కార్మికుల అనారోగ్య పరిస్థితిని గమనించి మెడికల్ బోర్డుకు పెట్టుకోమని చెప్పి నేటికీ వారిని పిలవకుండా పోవడం వలన జీతం లేక కార్మికులు ఆర్థికంగా అప్పులపాలవుతున్నారని మరోవైపు రెండు సంవత్సరాల పైబడి సర్వీస్ ఉన్నప్పుడు పెట్టుకున్న వారు రిటైర్డ్ దగ్గరికి వస్తున్నా ఇప్పటికి బోర్డుకు పిలవడం లేదని మానసికంగా కృంగిపోతూ డ్యూటీలు సరిగా చేయడం లేదని ఆరోపించారు. ఇలాంటి విధానాల వలన కార్మికులు డ్యూటీలు చేయకుంటే వారిని తక్కువ మస్టర్లు ఉన్నాయని కౌన్సిలింగ్ కు భార్య పిల్లలతో రమ్మని నోటీసు బోర్డు వేయడం వలన మరింత మానసిక అనారోగ్యానికి గురవుతున్నారని రాజారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు సంవత్సరాల ముందు పెట్టుకున్న కార్మికులు ఇంకో రెండు మూడు నాలుగు ఐదు నెలలున్న మెడికల్ కు పిలవకపోవడం ఏవిధంగా సరైయిందని యాజమాన్యం ఇచ్చిన సర్కులర్ యాజమాన్యమే తుంగలో తొక్కితే ప్రశ్నించాల్సిన గుర్తింపు సంఘం మాట్లాడామని తూతూ మంత్రంగా చెప్పడం తప్ప అన్ని సంఘాలను కలుపుకొని పోరాటాలకు పిలుపునివ్వడం లేదని అన్నారు. కొందరు అధికారులు నాయకుల వలన పైరవీల రేటు మరింతగా పెరిగి కార్మికులు అప్పుల పాలవుతున్న యాజమాన్యం స్పందించకపోవడం సరైన విధానం కాదని ప్రభుత్వాల చేతిలో కీలుబొమ్మలుగా మారకుండా పరిశ్రమల నిబంధన కనుగుణంగా ఎలాంటి అశాంతి నెలకొనకుండా మెడికల్ బోర్డు వేదవిధిగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. 150 మస్టర్ల నిబంధన తొలగింపు పై సర్కులర్ ఇచ్చి కార్మికుల అశాంతిని తొలగించాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. మరోవైపు చలి తీవ్రత పెరిగి కార్మికులు విధులకు రావడానికి నైట్ షిఫ్ట్ లో ఇబ్బంది పడుతున్నా యాజమాన్యం ఇవ్వాల్సిన గరం కోట్లను ఇవ్వడం లేదని, సిహెచ్ పి లో దుమ్ముతో ఇబ్బంది పడుతున్న వాటర్ స్ప్రింగ్ చేయించడం లేదని, ఓపెన్ కాస్ట్ బ్లాస్టింగ్ వల్ల దుమ్ముతో ఇబ్బంది పడుతున్నారని యాజమాన్యం నివారణ చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి మేదరి సారయ్య, సాంబారు వెంకటస్వామి, అర్జీవన్ బ్రాంచ్ అధ్యక్షులు ఆరేపల్లి రాజమౌళి, మామిడాల శ్రీహరి, జంగపల్లి మల్లేష్, కస్తూరి చంద్రశేఖర్, పెరుకా సదానందం డిపెండెంట్లు పాల్గొన్నారు.

# అధ్యాపకుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి

**-టీఎస్ టీసీఈఎ అధ్యక్షుడు ఆయనేని సంతోష్ కుమార్**
**-జె.ఎన్.టి.యు.హెచ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్ రావుకు వినతి**



**హైదరాబాద్, నవంబర్ 20 (అక్షర వేదం) :**
నిబంధనల ప్రకారం అధ్యాపకులకు ఇవ్వాల్సిన సర్టిఫికిట్స్, జీతం ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని జె.ఎన్.టి.యు.హెచ్ రిజిస్ట్రార్ వెంకటేశ్వర్ రావును గురువారం కలసి విజ్ఞప్తి చేసినట్లు తెలంగాణ స్కూల్స్, టెక్నీకల్ ఎంప్లాయిస్ అసోసియేషన్(టీఎస్ టీసీఈఎ) అధ్యక్షుడు ఆయనేని సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు రిజిస్ట్రార్ సానుకూలంగా స్పందించినట్లు చెప్పారు. అధ్యాపకులకు మేలు జరిగే విధంగా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఇదే సమయంలో అధ్యాపకుల వయస్సు 60 ఏళ్ల నుంచి 65 ఏండ్లకు పొడిగించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరినట్లు చెప్పారు. ప్రధానంగా కొన్ని కళాశాలలో జీతాలు చెల్లించడం లేదని అన్నారు. అందులో భాగంగా మహావీర్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ లో అధ్యాపకులకు సరియైన జీతాలు చెల్లించడం లేదన్నారు. అధ్యాపకులు మూడు నెలల ముందస్తు నోటిఫికేషన్ ఇవ్వడం జరిగిందన్నారు. సర్టిఫికెట్స్ పెట్టుకోవడం ఒక నేరం అని, అది పెట్టుకొని ఇవ్వకుండా అధ్యాపకులను ఇబ్బందిపెట్టే విధంగా చూస్తున్నారని అన్నారు. నిబంధనల ప్రకారంగా జీతాలు చెల్లించడం లేదని వారు వాపోతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నరేష్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

# సివిల్ సప్లై కార్పొరేషన్ డిపార్ట్మెంట్ ను మోసం చేసిన వ్యక్తులపై కేసు నమోదు




**అక్షర వేదం/మంథని,నవంబర్20:**
మంథని మండలంలోని గద్దలపల్లి గ్రామంలో గల శ్రీ లక్ష్మీ ప్రసన్న ఇండస్ట్రీస్ యొక్క పార్ట్నర్స్ బైర్నేని వర ప్రసాద్ రావు తండ్రి చంద్రారావు,గ్రామం శ్రీపురం కాలనీ కరీంనగర్.తాటిపల్లి శ్రీనివాస్ తండ్రి సత్యనారాయణ,గ్రామం పుట్టపాక.సివిల్ సప్లై కార్పొరేషన్ వారితో చేసుకున్న ఒప్పందం ప్రకారం 2023,24 సంవత్సరానికి సంబంధించి ఖరీఫ్ సీజన్ కు గాను కొనుగోలు చేసిన వడ్లను శ్రీ లక్ష్మీ ప్రసన్న రైస్ మిల్లుకు 38,489 క్వింటాళ్లు ఇస్తే అందుకుగాను శ్రీలక్ష్మి ప్రసన్న ఇండస్ట్రీస్ వారు సివిల్ సప్లై కార్పొరేషన్ వారికి 25680.43 క్వింటాళ్ల బియ్యం ను అప్పగించాలి.కానీ నిందితులు అయిన A1వర ప్రసాద్ రావు A2 తాటిపల్లి శ్రీనివాసులు చేసుకున్న అగ్రిమెంట్ దుర్వినియోగం చేసి సివిల్ సప్లై కార్పొరేషన్ వారికి బియ్యం ఇవ్వకుండా 12 కోట్ల 37 లక్షల 8 వేల 59 రూపాయలు మోసం చేసినందుకు ఫిర్యాదు చేసిన వారు ముప్పిడి శ్రీకాంత్,తండ్రి వెంకటేశ్వర్ రెడ్డి గ్రామం తీగల గుట్టపల్లి కరీంనగర్ వృత్తి సివిల్ సప్లైకార్పొరేషన్ జిల్లా మేనేజర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు క్రైమ్ నెంబర్ 139/2024 U/S 406, 409,420 ఐపిసి సెక్షన్ల కింద మంథని పోలీస్ స్టేషన్ లో కేసు నమోదు అయింది.ఈ కేసులో A2 అయిన తాటిపెల్లి శ్రీనివాసును గతంలో అరెస్టు చేయగా,గురువారం రోజున బైర్నేని వర ప్రసాద్ రావును అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచామని మంథని సీఐ రాజు తెలిపారు..


# ఏఐటీయూసీ లో భారీ చేరికలు

**అక్షర వేదం:నవంబర్ 20,రామగిరి**
గురువారం ఆర్జీ త్రీ వైస్ ప్రెసిడెంట్ బండారి క్రాంతి, ఏ ఎల్ పి పిట్ సేక్రటరీ గంగాధర్ ఆధ్వర్యంలో హెచ్ఎంఎస్ నుండి ఏఐటీయూసీ లోకి భారీ చేరారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఏఐటీయూసీ డిప్యూటీ జనరల్ సెక్రటరీ వైవీ రావు,బ్రాంచ్ సెక్రటరీ ఎం ఆర్ సి రెడ్డి హెచ్ఎంఎస్ బ్రాంచ్ సెక్రెటరీ మహేష్,ఆర్గనైజ్ సెక్రటరీ రానా కుమార్ అర్జున్, సత్యము, నరేష్, అజయ్,ప్రవీణ్, వెంకన్న, ప్రసాద్,యశ్వంత్,నరేష్ ను ఏఐటీయూసీ యూనియన్ లొ కి కండువా కప్పి ఆహ్వానించడం జరిగింది. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఆర్గనైజ్ సెక్రెటరీ. రంజిత్, విజయ్,రూప్ సింగ్, వంశి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# ఆర్థిక సహాయం అందించిన హిందూ సనాతన ధర్మ సేవాసమితి



**అక్షర వేదం/హనుమకొండ**
మన సనాతన హిందూ సేవా సమితి నుండి 132 వ సేవా కార్యక్రమం... చిన్న వయసులోనే తల్లిని కోల్పోయి,, తండ్రికి ఆరోగ్య సమస్యలు,, మరో వైపు పేదరికం,, ఈ నేపథ్యంలో లో దాతల సహాయం తో పెళ్లి చేసుకుంటున్న వరంగల్ లోని ఎస్ఆర్ఆర్ తోట కు చెందిన సిరిపురం ధనలక్ష్మి కి మన గ్రూప్ నుండి స్టీల్ బోళ్ళు,,, ఇత్తడి మంగళహారతి సెట్,,, ఇంట్లోకి కావాల్సిన ఇతర వస్తువులు అందించాము....
ఈ కార్యక్రమం లో గ్రూప్ వ్యవస్థాపకుడు తాళ్లపల్లి నగేష్,, సలహాదారు అంచూరి వేణు గోపాల్,, గ్రూప్ సభ్యులు బడుగు రాము,, బైరిశెట్టి కార్తీక్,, గట్టు సునీల్,, పడకంటి రామ్ చందర్ పాల్గొన్నారు....

# కిండర్ కబ్స్ ప్రీ స్కూల్లో ఘనంగా బ్లూ డే




**అక్షర వేదం/హైదరాబాద్**
రంగారెడ్డి జిల్లా నిజాంపేట ఏరియాలో ఉన్న కిండర్ కబ్స్ ప్రీస్కూల్లో అంతర్జాతీయ బాలల హక్కు దినోత్సవం పురస్కరించుకొని,చిన్నారుల్లో స్వేచ్ఛ వాతావరణం కల్పిస్తే వారిలోని అంతర్లీన ప్రతిభకు మరింత పదును పెట్టిన వారమవుతామని భావించి ఆ దిశగా ప్రీ స్కూల్లో బ్లూడే కార్యక్రమాలకు స్వీకారం చుట్టామని పాఠశాల యాజమాన్యం పేర్కొంది.
ఈ కార్యక్రమంలో ప్రీస్కూల్ డైరెక్టర్లు అభిషేక్,ప్రసాద్, సింధూజ,శ్రావ్యతో పాటుగా తల్లిదండ్రులు,చిన్నారులు పాల్గొన్నారు.

# సోషల్ మీడియాను బాధ్యత రాహిత్యంగా వాడితే కఠిన చర్యలు తప్పవు



**అక్షర వేదం/మంథని,నవంబర్20:**
మంథని పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని యువత సామాజిక మాధ్యమాల్లో బాధ్యత రాహిత్య ప్రవర్తనపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ రమేష్ హెచ్చరించారు.సోషల్ మీడియాలో కొందరు వ్యక్తులు ఇరువర్గాలను రెచ్చగొట్టే విధంగా,వర్గాల మధ్య విభేదాలు తలెత్తేలా పోస్టులు,కామెంట్లు పెడుతున్నట్లు పోలీసులు దృష్టికి రావడం జరిగిందని,ఇటువంటి చర్యలు ప్రమాదకరమని శాంతి భద్రతల సమస్యలు వచ్చే పరిస్థితి ఉందని వారు తెలిపారు.ఒక వర్గాన్ని కించ పరిచే విధంగా సోషల్ మీడియాలో ప్రచారం చేసే సమాచారం నిజమా కాదా అని ధృవీకరించకుండా సోషల్ మాధ్యమాల్లో పెట్టడం ఇతరులను టార్గెట్ చేస్తూ పెట్టే వ్యాఖ్యలు చేస్తే ఘర్షణలకు కారణమయ్యే పరిస్థితి ఎదురవుతుందని కావున అటువంటి వీడియోలు,ఫోటోలు పోస్ట్ చేయడం చట్టవిరుద్ధమని తెలిపారు.అందరూ సోషల్ మీడియాను బాధ్యతగా ఉపయోగించాలని,అలాంటి పోస్టులు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.సమాజంలో శాంతి,సహనం పాటిస్తూ మెలగడం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్ ఐ రమేష్ స్పష్టం చేశారు..

## జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే నవీన్ యాదవ్ ను మర్యాద పూర్వకంగా కలిసిన టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు



**అక్షర వేదం/మంథని,నవంబర్20:**
జూబ్లీహిల్స్ లో ఇటీవల భారీ మేజర్టితో ఎమ్మెల్యే గా గెలిచిన నవీన్ యాదవ్ ను టీపీసీసీ ప్రధాన కార్యదర్శి దుద్దిళ్ల శ్రీను బాబు హైదరాబాద్ లో మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా శ్రీను బాబు మాట్లాడుతూ నవీన్ యాదవ్ గెలుపుతో కాంగ్రెస్ పార్టీ పై ప్రజలకు ఉన్న నమ్మకాన్ని నిలబెట్టిందన్నారు.నవీన్ యాదవ్ ను భారీ మెజార్టీతో గెలిపించిన జూబ్లీహిల్స్ నియోజకవర్గ ప్రజలకు శ్రీనుబాబు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.నవీన్ యాదవ్ గెలుపులో ఎంతో కష్టపడి పనిచేసిన కాంగ్రెస్ నాయకులకు,కార్యకర్తలకు కూడా శ్రీనుబాబు ప్రత్యేకమైన కృతజ్ఞతలు తెలిపారు..

## ఈ.ఎం.ఆర్.ఎస్. జాతీయ క్రీడా మహోత్సవం

**-2025 కార్యక్రమానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ , ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే**



**అక్షర వేదం/హైదరాబాద్:-నవంబర్ 20.**
హైదరాబాద్లో జరిగిన 4వ ఈ.ఎం.ఆర్.ఎస్. జాతీయ క్రీడా మహోత్సవం-2025 కార్యక్రమానికి మంత్రి అడ్లూరి లక్ష్మణ్ , ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే డా. జాటోత్ రామచంద్ర నాయక్ హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు.మంత్రి లక్ష్మణ్ మాట్లాడుతూ, "ఈ.ఎం.ఆర్.ఎస్ విద్యార్థులు తమ ప్రతిభను జాతీయస్థాయిలో చాటుకునేందుకు ఇది గొప్ప వేదిక" అని అన్నారు.డా. రామచంద్ర నాయక్ , "గిరిజన విద్యార్థుల కోసం ప్రభుత్వం అందిస్తున్న సహకారం వల్లే ఈ.ఎం.ఆర్.ఎస్ పాఠశాలలు దేశవ్యాప్తంగా అగ్రస్థానంలో నిలుస్తున్నాయి" అని పేర్కొన్నారు.హైదరాబాద్లో జరిగిన ఈ మహోత్సవంలో పలు రాష్ట్రాల ఈ.ఎం.ఆర్.ఎస్ విద్యార్థులు పాల్గొని వివిధ క్రీడా విభాగాల్లో ప్రతిభ కనబరిచారు.

## సత్యసాయి జయంతి వేడుకలకు తప్పకరండి

**-మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్ కు ఆహ్వానం..**



**అక్షర వేదం/ మహబూబాబాద్ జిల్లా ఎస్పీ కార్యాలయం :- నవంబర్ 20.**
మహబూబాబాద్ జిల్లా కురవి మండలకేంద్రంలో ఈనెల 23వ తేదీన ఘనంగా నిర్వహించనున్న భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి శతజయంతి వేడుకలకు హాజరు కావాలని మహబూబాబాద్ జిల్లా ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్ ను శ్రీ సత్యసాయి సేవాసమితి కన్వీనర్ సిహెచ్ శ్రీనివాస్ కోరారు.మహబూబాబాద్ జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్ ను కలిసి భగవాన్ శ్రీ సత్యసాయిబాబా వారి చిత్రపటాన్ని, ఆహ్వానపత్రికను అందజేశారు. ఉదయం 5 గంటలకు నగరసంకీర్తనతో స్వామి వారి జయంతి వేడుకలు ప్రారంభం అవుతాయని, ఏడు గంటలకు రుద్రాభిషేకం, మంగళహారతి కార్యక్రమాలు ఉంటాయని కన్వీనర్ సిహెచ్ శ్రీనివాస్ తెలిపారు. సాయంత్రం 4గంటలకు శతవర్షమహోత్స రథయాత్ర ప్రారంభం అవుతుందని, కురవి పురవీధులలో శోభాయాత్ర నిర్వహించి ఏడుగంటలకు ప్రశాంతనిలయం చేరుకుని కేక్ కటింగ్, మంగళహారతి, పవలింపుసేవ నిర్వహించడంతో జన్మదిన వేడుకలు ముగిస్తాయని ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్ కు తెలిపారు. తప్పనిసరిగా హాజరై బాబా వారి ఆశీస్సులు స్వీకరించాలని శ్రీ సత్యసాయి సేవాసమితి కన్వీనర్ సిహెచ్ శ్రీనివాస్ ఎస్పీ సుధీర్ రాంనాద్ కేకన్ ను మర్యాదపూర్వకంగా కోరారు. ఈ.. కార్యక్రమంలో సేవాసమితి బాధ్యులు గండేపల్లి తిరుమలరావు తో పాటు సీనియర్ జర్నలిస్ట్ చీకటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఓ సి పి 2 ప్రాజెక్టు అధికారికి టీబీజీకేఎస్ స్వాగత సత్కారం

**-సింగరేణి పురోభివృద్ధికి అందరూ కృషి చేయాలి**
**-గనులలో రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రాధాన్యం**
**-ఓసి టు ప్రాజెక్ట్ అధికారి రాజశేఖర్**



**అక్షర వేదం:నవంబర్ 20,రామగిరి**
ఉద్యోగులు క్రమశిక్షణతో సమయపాలన పాటించి పూర్తిస్థాయిలో విధులు నిర్వహించినప్పుడే కంపెనీ ఆశించిన స్థాయిలో ఉత్పత్తి ఉత్పాదకత సాధ్యమవుతుందని దీనికి తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం శ్రేణులంతా సహకరించాలని ఓసీపీ టు ప్రాజెక్ట్ అధికారి రాజశేఖర్ కోరారు.గురువారం సెంటినరీ కాలనీలోని ఓసిపి టు పి.ఓ కార్యాలయంలో తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం ఉపాధ్యక్షులు నాగేల్లి సాంబయ్య నేతృత్వంలో పిట్ సెక్రటరీలు వేముల రవిశంకర్, చిప్ప సురేష్ బృందం నూతనంగా బాధ్యతలు స్వీకరించిన రాజశేఖర్ కు ఘనంగా స్వాగత సత్కారం నిర్వహించారు.పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు నాగేల్లి సాంబయ్య మాట్లాడుతూ తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం అధికారంలో ఉన్న సందర్భంలో కార్మికుల సంక్షేమం కోసం మరియు కంపెనీ ముందుకు వెళ్లేందుకు చేసిన కృషిని ఇప్పటికీ అందరూ మెచ్చుకుంటున్నారని గుర్తు చేశారు.సింగరేణి అధికారులు,మీ అందరి సూచనలు మేరకు క్రమశిక్షణతో,రక్షణతో కూడిన ఉత్పత్తి సాధనకు ఉద్యోగులందరినీ కార్యోన్ముఖులను చేస్తామని దీనికి టీబీజీకేఎస్ ప్రధాన భూమిక పోషిస్తుందని హామీ ఇచ్చారు. ప్రాజెక్టు అధికారిగా బొగ్గు ఉత్పత్తికి, కార్మిక సంక్షేమంలో పెద్దపీట వేస్తూ మీరు మరింత అభివృద్ధి చెందాలని టీబీజీకేస్ పక్షాన శు భాకాంక్షలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ పింగిలి సంపత్ రెడ్డి,అసిస్టెంట్ పెట్ సెక్రటరీ వీరగోని సంతోష్ గౌడ్, రిలే ఏ షిఫ్ట్ ఇంచార్జ్ బర్ల సుధాకర్,సెంట్రల్ బ్రాంచ్ కమిటీ నాయకులు దేవ శ్రీనివాస్,పాశం శ్రీనివాస్ రెడ్డి,ఊరడి రమేష్,షరీఫ్,బొడ్డు వినయ్, గండి శ్రీనివాస్,దాసరి మల్లేష్,పొన్నం సదయ్య, బీరం సంజీవ్ కుమార్,పిడుగు సురేష్, గాండ్ల సతీష్ కుమార్,మంద రవీందర్,కుమ్మరి కుంట వెంకటేశం, శ్యామ్, శ్రీనివాస్, రవీందర్, సత్యనారాయణ తదితరులున్నారు.

## జి.ఎం సి.హెచ్.పి పర్యటన



**అక్షర వేదం:నవంబర్ 20,రామగిరి**
సింగరేణి సంస్థ కార్పోరేట్ సిహెచ్పి ల విభాగం జనరల్ మేనేజర్ ఎస్.వి.రామమూర్తి గురువారం రామగుండం-3 ఏరియాలో పర్యటించారు. నూతనంగా కార్పోరేట్ సిహెచ్పి ల విభాగం జనరల్ మేనేజర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటిసారిగా ఏరియాలో పర్యటించిన సందర్భంగా జి.యం.కార్యాలయం నందు రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు వారిని శాలువాతో సత్కరించి, మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం వారు ఏరియా లోని సిహెచ్పిని సందర్శించి,పరిశీలించారు.కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ వై.వి.శేఖర్ బాబు,సిహెచ్పి డిజియం కాశీ విశ్వేశ్వర రావు,ఇతర అధికారులు ఉన్నారు.

## శీలేశ్వర సిద్దేశ్వర ఆలయంలో ప్రత్యేక భజన కార్యక్రమం



**అక్షర వేదం/మంథని,నవంబర్20:**
కార్తీక మాసం ఎంతో విశిష్టత కలిగిన పౌర్ణమితి బుధవారం నాడు ప్రారంభమై నవంబర్19 గురువారంతో ముగిసింది.కార్తీక మాసం చివరి రోజు కావడంతో మంథని పట్టణంలోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి.మంత్రపురిగా ప్రసిద్ధిగాంచిన మంథనిలోని ఓంకారేశ్వర స్వామి,భిక్షేశ్వర స్వామి,శీలేశ్వర,సిద్దేశ్వర స్వామి,గోదావరి నది తీరంలో గల గౌతమేశ్వర స్వామి ఆలయాల్లో విశేష సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.కార్తీక మాసంలో నెల రోజులపాటు శీలేశ్వర,సిద్దేశ్వర స్వామి ఆలయంలో నెల రోజుల పాటు భజన కార్యక్రమము నిర్వహించారు.చివరి రోజు అయిన గురువారం రోజున శీలేశ్వర,సిద్దేశ్వర స్వామి దేవాలయంలో రాత్రి 7.30 నుండి10 గంటల వరకు చక్రిభజన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు.అన్నదాన కార్యక్రమాన్ని నిర్వాహకులు లోకే మనోహర్,లోకే శరత్ లు ఏర్పాటు చేశారు.అన్ని వాడలకు చెందిన భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.ఆధ్యాత్మిక కేంద్రంగా ప్రసిద్ధి గాంచిన మంథనిలోని మహాలక్ష్మి దేవి,లక్ష్మీనారాయణ స్వామి ,దత్తాత్రేయ స్వామి,గణపతి, లలితాంభిక దేవి,షిరిడీ సాయిబాబా, సత్య సాయిబాబా,ఆంజనేయ స్వామి,అయ్యప్ప, రామాలయం, బాల సరస్వతి దేవి ఆలయాలను భక్తులు దర్శించుకునీ ప్రత్యేక పూజలు నిర్వహించారు..

## ఆర్ జీ త్రీ ఏరియా అధికారుల ను సన్మానించిన ఐఎన్టియుసి నాయకులు



**అక్షర వేదం:నవంబర్ 20,రామగిరి**
రామగుండం ఏరియా 3 డివిజన్ లో సింగరేణి కోల్ మైన్స్ ఆఫీసర్ అసోసియేషన్ అధ్యక్షులు గా ఎన్నికైన కోల శ్రీనివాస్ గౌడ్,అడిషనల్ మేనేజర్ ను ఆఫీసర్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ శనిగవరపు శ్రీనివాస్ ఎస్.ఈ ను కోట రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఐఎన్టియుసి నాయకులు సన్మానించడం జరిగింది.అనంతరం మాట్లాడుతూ కోట రవీందర్ రెడ్డి రామగుండం ఏరియా 3 లో మా యూనియన్ కార్మికుల కోసం ఎలాగైతే పోరాటం చేస్తున్నామో మీ ఆఫీసర్ అసోసియేషన్ కు కూడా మా వంతు గా పూర్తి సహాయ సహకారం అందిస్తామని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో సెంట్రల్ నాయకులు గడ్డం తిరుపతి యాదవ్,యల్లంకి రామారావు,ఉయ్యాల కుమారస్వామి,మడ్డి రాజకుమార్,బ్రాంచ్ నాయకులు సందేల కుమారస్వామి,రెసిడెన్షియల్ కమిటీ మెంబర్ బుద్దే సదానందం,ఓసీ పి 2 ఫిట్ సెక్రటరీ రామిండ్ల మనోహర్,ఓసీ పి 2 అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ దుండే రాజేందర్,ఏ ఎల్ పి అసిస్టెంట్ ఫిట్ సెక్రటరీ సర్వాన్ నాయక్,సీనియర్ ఐఎన్టియుసి నాయకులు కొమురయ్య,మైన్ కమిటీ మెంబర్ బి.సురేష్ కుమార్,సేఫ్టీ కమిటీ సభ్యులు చంద్ర శేఖర్ తదితరులు పాల్గొనారు.

## ప్రజాశక్తి రిపోర్టర్ చింత వెంకన్న ను పరామర్శించిన

**- మాజీ కౌన్సిలర్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి.**



**అక్షర వేదం/మరిపెడ:-నవంబర్ 20.**
మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ప్రజాశక్తి రిపోర్టర్ చింత వెంకన్న,కు గాలి బ్లాడర్ స్టోన్స్ సర్జరీ చికిత్స జరిగింది అని తెలుసుకొని అనంతరం మరిపెడ మున్సిపల్ కేంద్రంలోని మూడో వార్డు సీతారాంపురం కాలనీలో ఇంటిదగ్గర విశ్రాంతి తీసుకుంటున్న మరిపెడ మండల ప్రజాశక్తి రిపోర్టర్ చింత వెంకన్న, ను పరామర్శించిన, మాజీ కౌన్సిలర్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి,ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకుని ఆరోగ్యం త్వరగా కోలుకోవాలని, వైద్యుల సూచనల ప్రకారం సమయానుసారంగా మందులు వాడుతూ విశ్రాంతి తీసుకోవాలని, మాజీ కౌన్సిలర్ వీసారపు ప్రగతి శ్రీపాల్ రెడ్డి,తగు సూచనలు తెలిపారు, వారి వెంట అల్వాల ఉపేందర్ ,ప్రజాపతి గంధసిరి, బిక్షపతి గౌడ్,చింత వెంకన్న కుటుంబ సభ్యులు తదితరులున్నారు.

# మహబూబాబాద్‌కు వరం కళ్ల ముందే ఘన్‌పూర్‌కు దోపిడీ!

**- ప్రజా ప్రతినిధులు గాడనిద్రలో-ప్రజలు మేల్కొంటున్నారు!**


మార్చిలోపు కోచ్ ఫ్యాక్టరీ నిర్మాణం పూర్తి
- వరంగల్ ఎంపీ కడియం కావ్య
- కోచ్ ఫ్యాక్టరీని సందర్శించిన ఎంపీ, ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- రైల్వే అధికారులతో ప్రత్యేక సమావేశం

300 ఎకరాల్లో డిపో కోసం స్థల పరిశీలన

అక్షర వేదం /మహబూబాబాద్ జిల్లా :- నవంబర్ 20.
మహబూబాబాద్ జిల్లాను అభివృద్ధి పథంలో దూసుకుపోయే మెగా మెయింటెనెన్స్ రైల్వే డిపో మొదటగా ఇక్కడికే మంజూరు అయిన ఈ బంగారు ప్రాజెక్టును ఇప్పుడు మన కళ్ల ముందే స్టేషన్ ఘన్‌పూర్‌కు లాక్కెళ్లే కుట్ర బయటపడింది. మహబూబాబాద్ ప్రజలు ఆగ్రహిస్తున్నా మన ప్రజా ప్రతినిధులు మాత్రం గాడనిద్రలో!వరంగల్ నేతల లాబీయింగ్ స్పీడ్ మన నేతల మౌనం ఎందుకు?
ఈ ప్రాజెక్టును మరో జిల్లా వైపు మళ్లించేందుకు
వరంగల్ ఎంపీ కడియం కావ్య
స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి
వర్ధన్నపేట ఎమ్మెల్య నాగరాజులు
రైల్వే అధికారులతో వరుస సమావేశాలు, లాబీయింగ్, ఒత్తిళ్లతో ప్రాజెక్ట్‌ను కాజేయడానికి జోరుగా కదులుతుంటే మన మానుకోట-మహబూబాబాద్ ప్రజా ప్రతినిధులు అయితే ఒక్క మాట కూడా అడగలేదు!జిల్లా భవిష్యత్తు చేతుల నుండి జారిపోతుంటే వీరు ఎందుకు నిశ్చేష్టులై కూర్చున్నారు?ప్రజలు అడుగుతున్న ప్రశ్న ఇదొక్కటే.ఈ డిపో వెళ్లిపోతే మహబూబాబాద్‌కు వచ్చే భారీ నష్టం300-500 ప్రత్యక్ష ఉద్యోగాలు అటు పరారవుతాయిరైలు సేవలు, సదుపాయాలు, ట్రాఫిక్ అభివృద్ధి కత్తెర లాజిస్టిక్స్-వ్యాపార అవకాశాలు వరంగల్ వైపే
కేంద్ర-రాష్ట్ర నిధులు కూడా మారే ప్రమాదం
చివరికి జిల్లా అభివృద్ధి ఆగిపోతుంది!
ఇంత పెద్ద నష్టం ఎదురైనా, మన నేతలు ఎందుకు స్పందించట్లేదు?రాజకీయ ఒత్తిడి? ఒప్పందాల పాలనా? లేక బాధ్యత మరిచారా?ఘన్‌పూర్ నేతల వేగం మహబూబాబాద్ నేతల మౌనం
ఘన్‌పూర్ వర్గాలు మాత్రం ఏకగ్రీవంగా కదిలి రైల్వే బోర్డు దగ్గర వరుస ఒత్తిళ్లు పెంచుతున్నారు.
అక్కడ అంతా లాక్కో! లాక్కో! అంటూ కదులుతుంటే ఇక్కడ మాత్రం నిశ్శబ్దం-నిస్సహాయత-నిర్లక్ష్యం!

**ప్రజలకు హక్కు ఉన్న ప్రశ్నలు**
మహబూబాబాద్‌కు మంజూరైన ప్రాజెక్ట్ ఎందుకు తరలుతోంది?
రైల్వే అధికారులతో మన నేతలు ఎందుకు మాట్లాడలేదు?
కేంద్రానికి, రైల్వే బోర్డుకు లేఖ పంపిందెవరు?
ప్రజలకు నిజాలు ఎందుకు దాచుతున్నారు?
ఉత్తరం ఎక్కడా లేదు!
ప్రజలు ఇప్పుడు మౌనంగా ఉంటే జిల్లాకు శాశ్వత నష్టం!
ఈ మెగా ప్రాజెక్ట్ ఒకసారి పోతే తిరిగి రావడం కష్టం.
నేతల నిర్లక్ష్యం-జిల్లాకు చెరిగిపోని నష్టం.
అందుకే ఇప్పుడే ప్రజలు నిలదీయాలి. ఇప్పుడే ఆందోళన మొదలు పెట్టాలి.
జిల్లా హక్కు కోసం ప్రజలే గళమెత్తాలి.

# టిడబ్ల్యూజేఎఫ్ తో బసవపున్నయ్యకు సంబంధం లేదు




**ఫెడరేషన్ నుంచి అతన్ని తొలగించాం**
**ఫెడరేషన్ పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు**

హైదరాబాద్,నవంబర్ 20 అక్షర వేదం
తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్)తో బసవపున్నయ్య అనే వ్యక్తికి ఎలాంటి సంబంధం లేదని, సంఘ వ్యతిరేక చర్యలకు పాల్పడినందున ఆయనను ఫెడరేషన్ నుంచి తొలగించడం జరిగిందని ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షు, రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ మామిడి సోమయ్య తెలిపారు. ఈనెల 15న హైదరాబాద్ లో జరిగిన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో దాదాపు 30 జిల్లాల నుంచి 130 మంది రాష్ట్ర ఆఫీస్ బేరర్లు,కార్యవర్గ సభ్యులు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు,రాష్ట్ర కౌన్సిల్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు, సంఘం వ్యవస్థాపక సభ్యులు హాజరయ్యారని, ఈ సమావేశంలో బసవపున్నయ్యను ఫెడరేషన్ నుంచి శాశ్వతంగా తొలగిస్తూ ఏకగ్రీవ తీర్మానం ఆమోదించారని ఆయన తెలిపారు. గురువారం హైదరాబాద్ లోని ఎస్ ఎస్ ఎస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఫెడరేషన్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు, కన్వీనింగ్ కమిటీ కో-కన్వీనర్లు వల్లాల జగన్, బండి విజయ్ కుమార్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు ఎం. పద్మనాభ రావులతో కలిసి పలు విషయాలను వెల్లడించారు. గత పదేళ్లుగా సంఘానికి వచ్చిన సభ్యత్వ రుసుము ఎంతో చెప్పకుండా, డైరీ, మ్యాగజిన్ ద్వారా వచ్చిన ఆదాయం లెక్కలు చూపకుండా, జిల్లాల మహాసభలు జరపకుండా అడ్డుకుంటూ సంఘాన్ని విచ్చినం చేస్తున్న బసవ పున్నయ్య ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దుచేసి ఆయనను ఫెడరేషన్ నుండి తొలగించినట్లు తెలిపారు. ఇక నుంచి టీడబ్ల్యూజేఎఫ్ కు బసవపున్నయ్యకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఇటీవల రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో ఏకగ్రీవ ఆమోదంతో ఏర్పడిన ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ అనుమతి లేకుండా బసవపున్నయ్య గానీ, ఇతరులు గానీ ఫెడరేషన్ పేరుతో ఎలాంటి కార్యక్రమాలు, కార్యకలాపాలు నిర్వహించరాదని అన్నారు. అంతేకాకుండా రాష్ట్ర కమిటీ రద్దయిందని, మళ్ళీ రాష్ట్ర మహాసభ జరిగేంత వరకు రాష్ట్ర కార్యవర్గం ఉండదని,ఎవరికీ ఎలాంటి పదవులు ఉండవని ఆయన స్పష్టం చేశారు. సంఘం కార్యకలాపాలు అనగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో సభ్యత్వ నమోదు, మహాసభలు, ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర కన్వీనింగ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర కమిటీ రద్దయినప్పటికీ కొందరు తమ పదవులను ఇంకా వాడుకుంటూ, టీడబ్ల్యూజేఎఫ్ పేరుతో కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలుస్తుందని, ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫెడరేషన్ పేరుతో కార్యక్రమాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే బాధ్యతలు రాష్ట్ర కన్వీనింగ్ కమిటీకి అప్పగించడం జరిగిందని, అదే విధంగా ఇటీవల పలు జిల్లాల్లో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, వ్యవస్థాపక సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన జిల్లా మహాసభల్లో ఎన్నికైన జిల్లా కమిటీలన్నీ యధావిధిగా కొనసాగుతాయని రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం ప్రకటించిందని మామిడి సోమయ్య తెలిపారు. ఫెడరేషన్ సభ్యులు, ఇతర జర్నలిస్టులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ఫెడరేషన్ సంఘానికి ఇంకా తానే ప్రధాన కార్యదర్శినంటూ తిరుగుతున్న బసవపున్నయ్య చెప్పే మాయ మాటలు నమ్మి జర్నలిస్టులు మోసపోవద్దని సూచించారు. ఆయన నిర్వహించే కార్యక్రమాలు కేవలం ఆయన పనిచేస్తున్న నవతెలంగాణ పత్రికకు సంబంధించినవి మాత్రమేనని, ఫెడరేషన్ కు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ఫెడరేషన్ ను కేవలం నవతెలంగాణ పత్రిక జర్నలిస్టులకే పరిమితం చేసి, ఆ పత్రిక ప్లాంట్ యూనియన్ గా మార్చి తన సొంతం చేసుకోవాలని చూస్తున్నారని,ఈ కుట్రలను ఫెడరేషన్ సభ్యులంతా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సంఘం నుంచి బహిష్కరణకు గురైన బసవపున్నయ్య,పిల్లి రాంచందర్ లు రేపు రాష్ట్రవ్యాపితంగా కలెక్టర్లకు వినతి పత్రాలు ఇచ్చే కార్యక్రమానికి పిలుపు ఇవ్వడం చట్టవిరుద్ధమని అన్నారు. కేవలం తమ ఉనికిని చాటుకునేందుకు బసవపున్నయ్య వేరు కుంపటి పెట్టి సంఘాన్ని విచ్చిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఆయన చేస్తున్న కార్యక్రమాలకు గానీ, సమావేశాలకు గానీ టీడబ్ల్యూజేఎఫ్ కు సంబంధం లేదని, సంఘం సభ్యులు ఎవరు కూడా ఆయన సొంత కార్యక్రమాలకు వెళ్ళవద్దని మామిడి సోమయ్య కోరారు.

# గీతా జయంతి సందర్భంగా సంపూర్ణ భగవద్గీత పారాయణం

**విద్యార్థులకు ప్రత్యేక పోటీల కరపత్ర ఆవిష్కరణ**



హైదరాబాద్, నవంబర్ 20 అక్షర వేదం
గీతా జయంతి సందర్భంగా సంపూర్ణ భగవద్గీత 18 అధ్యాయాల పారాయణం వైభవంగా జరగనున్నట్లు డాక్టర్ కె.వి. రమణాచారి ఆధ్వర్యంలో నిర్వహకులు ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన నివాసంలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. నక్క వెంకటమ్మ యాదవ్, నక్క యాదగిరి స్వామి యాదవ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ మరియు గీతా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులు, ప్రభుత్వ మరియు ప్రైవేట్ స్కూల్ పిల్లల కోసం ప్రత్యేక బహుమతుల కార్యక్రమాన్ని ప్రకటించారు. అలాగే కళాశాల విద్యార్థులు మరియు పెద్దవారి కోసం భగవద్గీత పఠన పోటీల కరపత్రం (బ్రోచర్) ను కె.వి. రమణాచారి, నక్క శ్రీనివాస్ యాదవ్, పీ. బడే సాబ్ చేతులమీదుగా ఆవిష్కరించారు. ఈ పోటీలు ఆన్‌లైన్ లో నిర్వహించబడుతాయని నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో ఆసక్తి ఉన్నవారు 9160607662 నంబరుకు కాల్ చేసి తమ పేర్లు నమోదు చేసుకోగలరు. గీతా జయంతి రోజు డిసెంబర్ 1న, తెలంగాణ సారస్వత పరిషత్‌లో బహుమతుల ప్రధానం ఘనంగా జరుగనున్నది. అదే రోజు భగవద్గీత మొత్తం 18 అధ్యాయాల సంపూర్ణ పారాయణం నిర్వాహకుల సమక్షంలో జరుగుతుంది. ఈ మహొత్సవానికి భగవత్ భక్తులు, గీతా అభిమానులు పెద్ద ఎత్తున హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్వాహకులు కోరుతున్నారు.

# సిపిఐ 100 ఏళ్ల ఉత్సవాల ప్రచార బస్సు జాత..




అక్షర వేదం/మహబూబాబాద్ జిల్లా ,కురవి మండల కేంద్రం :- నవంబర్ 20.
నేడు ఉదయం 10:30 గంటలకు కురవి మండల కేంద్రానికి రానున్న సిపిఐ 100 ఏళ్ల ఉత్సవాల ప్రచార బస్సు జాత ...ఈ బస్సు జాతకు సిపిఐ సీనియర్ నాయకులు మాజీ ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి చాడా వెంకట్ రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు తక్కెళ్ళపల్లి శ్రీనివాస్ రావు, కామ్రేడ్ కలవేని శంకర్ లు నాయకత్వం వహిస్తున్నారని సిపిఐ పార్టీ శ్రేణులు, వామపక్ష వాదులు తప్పక హాజరు కావాలని కోరిన సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి, ఆత్మకమిటీ చైర్మన్ నల్లు సుధాకర్ రెడ్డి.

# విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి





అక్షర వేదం /తొర్రూరు రెవెన్యూ డివిజన్:-నవంబర్ 20.
ఎస్ఎఫ్ఐ మహబూబాబాద్ జిల్లా గర్ల్స్ కో కన్వీనర్ రెబెల్లి శృతిఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో తొర్రూర్ డివిజన్ కేంద్రంలోని బాలికల సోషల్ వెల్ఫేర్ లో మధ్యాహ్న భోజనం పరిశీలన మోను ప్రకారం భోజనం పెట్టడం లేదని ప్రిన్సిపాల్ పై మండిపాటు మోను ప్రకారం భోజనం అందించని ప్రిన్సిపాల్ పై చర్యలు తీసుకోవాలి ఎస్.ఎఫ్.ఐ జిల్లా నాయకులు అమీర్ ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి మహేష్,మండల నాయకులు సాయి, వినయ్,ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి పేద ప్రజలకు వరం..





అక్షర వేదం /మరిపెడ మండల కేంద్రం:- నవంబర్ 20.
ఆపద సమయంలో ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరయ్యే ఆర్థిక సహాయం లబ్ధిదారులకు ఎంతో బాగా ఉపయోగపడుతుందని మరిపెడ మండల అధ్యక్షులు పెండ్లి రఘు వీరా రెడ్డి అన్నారు. గురువారం లబ్ధిదారులకు సీఎం సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను మరిపెడ మండల అధ్యక్షులు పెండ్లి రఘు వీరా రెడ్డి, రవీందర్ రెడ్డి,టి.పీ.సి.సి ఎల్.డి.ఎం.ఆర్.ఎస్ జిల్లా కోఆర్డినేటర్ బండి శ్రీనివాస్, మహబూబాబాద్ జిల్లా ప్రధాన కార్యదర్శి గూగులోత్ రవి నాయక్, మరియు మహబూబాబాద్ జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు జరుపుల విజయ్ నాయక్ గార్ల చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మరిపెడ మండల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాజశేఖర్,కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ సర్పంచ్ కృష్ణ నాయక్, ఎల్లంపేట గ్రామ పార్టీ అధ్యక్షుడు గండి వీరభద్రం, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గండి రమేష్, కొండయ , కర్ణ నాయక్ మండల యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సురేష్, మనోహర్ , వంశీ,తదితరులు పాల్గొన్నారు.



# ఏడాదిలో ఏడు సినిమాలు!

ప్రస్తుతం ఉన్న ట్రెండ్‌లో అగ్ర కథానాయికలు ఏడాదికి రెండుమూడు చిత్రాలు చేయడమే కష్టమైపోతున్నది. అలాంటిది ఒకే క్యాలెండర్ ఇయర్‌లో ఏడు చిత్రాలు చేసిన దక్షిణాది నాయికగా అనుపమ పరమేశ్వరన్ కొత్త ఫీట్‌ను సాధించింది. గతకొన్నేళ్లలో ఇదే రికార్డని అంటున్నారు. అనుపమ పరమేశ్వరన్ నటించిన లేడీ ఓరియెంటెడ్ చిత్రం 'లాక్‌డౌన్' రిలీజ్ డేట్‌ను బుధవారం ప్రకటించారు. డిసెంబర్ 5న ప్రేక్షకుల ముందుకురానుంది. సర్వైవల్ థ్రిల్లర్‌గా తెరకెక్కించిన ఈ చిత్రాన్ని అగ్రనిర్మాణ సంస్థ లైకా ప్రొడక్షన్ నిర్మించింది. ఏఆర్ జీవా దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ఈ ఏడాదిలో అనుపమ పరమేశ్వరన్‌కు ఇది ఏడో రిలీజ్ కావడం విశేషం. ఈ ఏడాది తమిళంలో డ్రాగన్, బైసన్, ది పెట్ డిటెక్టివ్ చిత్రాల్లో నటించింది అనుపమ. అందులో డ్రాగన్, బైసన్ మంచి విజయాల్ని అందుకున్నాయి. తెలుగులో కిష్కింధపురి, పరదా చిత్రాలను చేసింది. మలయాళంలో 'జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించింది. ప్రస్తుతం ఈ భామ తెలుగులో శర్వానంద్ సరసన 'భోగి' చిత్రంలో నటిస్తున్నది.

# మరోసారి కన్నడ చిత్రంలో ప్రియాంక...

హీరోయిన్ ప్రియాంక అరుళ్ మోహన్ కెరీర్ కన్నడ చిత్రం 'ఒంద కథ హెల్లా'తో ఆరేళ్ళ క్రితం మొదలైంది. ఆ తర్వాత అమ్మడు తమిళ, తెలుగు సినిమాలతో బిజీ అయిపోయింది. ఈ యేడాదిలో పవన్ స్టార్ పవన్ కళ్యాణ్ 'ఓజీ' లో హీరోయిన్ గా నటించి, ఘన విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. దీనికి ముందు తెలుగులో ప్రియాంక 'గ్యాంగ్ లీడర్', 'శ్రీకారం, సరిపోదా శనివారం' సినిమాలో చేసింది. అలానే పలు తమిళ అనువాద చిత్రాలతో తెలుగువారి ముందు కొచ్చింది.ఇదిలా ఉంటే నవంబర్ 20 ప్రియాంక మోహన్ పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆమె కొత్త కన్నడ సినిమాకు సంబంధించిన ప్రకటన వచ్చింది. డాక్టర్ శివరాజ్ కుమార్ , ధనుంజయ్ కీలక పాత్రధారులుగా హేమంత్ ఎం రావు దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న సినిమా '666 ఆపరేషన్ డ్రీమ్ థియేటర్'. ఈ సినిమాలో ప్రియాంక అరుల్ మోహన్ నటించబోతోందని మేకర్స్ తెలిపారు. ఈ విషయం గురించి ప్రియాంక మాట్లాడుతూ, 'శివరాజ్ కుమార్ గారి సినిమాలు చూస్తూ నేను పెరిగాను. ఆయన సినిమాలో భాగం కావడం ఎంతో ఆనందంగా ఉంది. హేమంత్ ఎం రావు గారి దర్శకత్వంలో నటించే అవకాశం ఇంత త్వరగా వస్తుందని ఊహించలేదు' అని తెలిపింది. ఇప్పటికే రెండు షెడ్యూల్స్ పూర్తి చేసుకున్న ఈ సినిమా మూడో షెడ్యూల్ డిసెంబర్ మొదటి వారంలో మొదలవుతుందని నిర్మాత డాక్టర్ వైశాఖ్ జె గౌడ చెప్పారు. ఈ చిత్రానికి చరణ్ రాజ్ సంగీతం అందిస్తుండగా, అద్వైత గురుమూర్తి సినిమాటోగ్రఫీ సమకూర్చుతున్నారు. ఈ భారీ చిత్రాన్ని కన్నడ, తెలుగు భాషల్లో ఒకేసారి విడుదల చేస్తామని మేకర్స్ తెలిపారు.





# చాలా బాధగా ఉంది..

## ఎఐ మార్ఫింగ్ ఫోటోలతో నష్టం ఆందోళన వ్యక్తం చేసిన నటి కీర్తి సురేశ్

తన పేరుతో ఆన్‌లైన్‌లో సర్క్యులేట్ అవుతున్న ఎఐ మార్ఫింగ్ చిత్రాలపై తీవ్ర ఆవేదన వ్యక్తం చేసింది అగ్ర కథానాయిక కీర్తి సురేష్. డీప్‌ఫేక్ టెక్నాలజీ ద్వారా రూపొందించబడిన ఈ నకిలీ ఫోటోలు తనను మానసికంగా బాధిస్తున్నాయని కీర్తి తెలిపింది. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టింది. మార్ఫింగ్ చిత్రాలు నా మనసుకి చాలా బాధ కలిగించడమే కాకుండా.. చాలా విసుగు పుట్టిస్తున్నాయి. ఈ కృత్రిమ మేధస్సుతో క్రియేట్ నకిలీ చిత్రాలు ఎంత నమ్మేలా ఉన్నాయంటే వాటిని చూసినప్పుడు నిజంగానే నేను అలా ఫోజు ఇచ్చానా? అని తనకు తాను ప్రశ్నించుకునే పరిస్థితి వచ్చిందని కీర్తి పేర్కొన్నారు. ఇది ఎఐ సాంకేతికత ఎంత ప్రమాదకరంగా మారిందో తెలియజేస్తుందని కీర్తి తెలిపారు. ఎఐ సాంకేతికత సామర్థ్యాలు నానాటికీ పెరుగుతున్నాయని వీటిని నియంత్రించడం కష్టంగా మారుతోందని కీర్తి సురేష్ ఆందోళన వ్యక్తం చేశారు. తమ అనుమతి లేకుండా తమ ఇమేజ్‌లను దుర్వినియోగం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైన ఉందని. ఈ సమస్య కేవలం సినీ పరిశ్రమకు మాత్రమే పరిమితం కాలేదని సోషల్ మీడియా, డిజిటల్ ప్లాట్‌ఫామ్‌లలో ఉండే ఎవరికైనా ఇది ముప్పుగా పరిణమించే అవకాశం ఉందని కీర్తి హెచ్చరించారు. ఇక కీర్తి సురేష్ ఆవేదనకు మద్దతుగా నటి ఆండ్రియా జెరెమియా కూడా ఎఐ వల్ల కలిగే నష్టాల గురించి మాట్లాడారు. నటులకే కాదు, సామాన్య ప్రజలకు కూడా ఎఐ సమస్యగా మారుతోంది. రష్మిక మందన్న, సమంత వంటి పలువురు నటీమణులు కూడా ఇలాంటి డీప్‌ఫేక్ లేదా మార్ఫింగ్ చిత్రాల బారిన పడ్డారు. ఇప్పుడు కీర్తి సురేష్ కూడా దీనిపై గళం విప్పడం, ఎఐ దుర్వినియోగం పై మరింత కఠినమైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరాన్ని సూచిస్తోంది.




# రూ.99లకే టికెట్..

## 'రాజు వెడ్స్ రాంబాయి' సినిమా బంపరాఫర్

టాలీవుడ్ నుంచి రాబోతున్న తాజా చిత్రం 'రాజు వెడ్స్ రాంబాయి'. ఈ సినిమా రేపు ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా.. ఈ మూవీపై బంపరాఫర్‌ని ప్రకటించింది చిత్రయూనిట్. ఈ సినిమా టికెట్ ధరను తగ్గించినట్లు చిత్రబృందం ప్రకటించింది. దీంతో సింగిల్ థియేటర్‌లలో ఈ చిత్రం రూ.99లకే అందుబాటులో ఉండబోతుండగా.. మల్టీప్లెక్స్‌లలో రూ.105గా నిర్ణయించినట్లు చిత్రబృందం తెలిపింది. తెలంగాణ రూరల్ బ్యాక్‌డ్రాప్‌లో రాబోతున్న ఈ చిత్రంలో అఖిల్, తేజస్విని జంటగా నటిస్తుండగా.. సాయిలు కంపాటి దర్శకత్వం వహిస్తున్నాడు. ఈ సినిమాను వేణు వుడుగుల నిర్మిస్తుండగా.. బన్నీ వాసు, వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతున్నారు.

# చెల్లితో ఆస్ట్రేలియా వెకేషన్..

# సాయి పల్లవి ఫొటోలు వైరల్

నేచురల్ బ్యూటీ సాయి పల్లవి కొద్ది రోజుల పాటు షూటింగ్స్‌కు బ్రేక్ ఇచ్చి, తన కుటుంబంతో, స్నేహితులతో కలిసి గడుపుతున్న విషయం తెలిసిందే. తనకు టైం దొరికినప్పుడల్లా చెల్లితో కలిసి వెకేషన్‌కి వెళుతుంది. తాజాగా సాయి పల్లవి తన చెల్లెలు పూజా కన్నన్‌తో కలిసి ఆస్ట్రేలియాకు వెళ్లినట్లు తెలుస్తోంది. పూజా కన్నన్ ఆస్ట్రేలియాలో ఉద్యోగం చేస్తున్నట్లు సమాచారం. దీంతో చెల్లిని కలవడానికి వెళ్లిన సాయి అక్కడ వేకేషన్‌లో దిగిన ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకుంది. ఈ ఫోటోలలో సాయి పల్లవి ఎప్పటిలాగే మేకప్ లేకుండా సహజమైన లుక్స్‌లో కనిపించి అభిమానులను ఆకట్టుకుంది. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన ఫొటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఇటీవల నాగ చైతన్యతో కలిసి 'తండేల్' చిత్రంతో ప్రేక్షకుల ముందుకు వచ్చిన సాయి ప్రస్తుతం బాలీవుడ్‌లో రామాయణ చిత్రంలో నటిస్తుంది. ఈ చిత్రంలో సాయి సీత పాత్రలో కనిపించబోతుంది.

